క్లుప్తంగా

కిటకిటలాడిన ఆలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామి వారి దేవాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. రెండో శనివారం సెలవుదినం, భీష్మ ఏకాదశి కూడా కలిసిరావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు.

బహుముఖ ప్రతిభాశాలి గుడిపాటి



విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి గుడిపాటి శ్రీరామమూర్తి అని సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్ అన్నారు. గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో శనివారం సంగీత విద్వాంసుడు హరికథా భాగవతార్ గుడిపాటి శ్రీరామమూర్తి 118 జయంతి వేడుకలు, హరికథా గానం కార్యక్రమం నిర్వహించారు. గౌరీనాథ్ మాట్లాడుతూ హరికథా సంస్కృతిని పరిరక్షించుకోవాల్సిన అవసముందన్నారు. విఖ్యాత హరికథా భాగవతారిణి మోపిదేవి దుర్గామహాలక్ష్మి భాగవతారిణి మాట్లాడుతూ గుడిపాటి సంగీత సాహిత్యసేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గుడిపాటి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గుడిపాటి జయరాం సుధాకర్ సంస్థ లక్ష్యాలను వివరించారు. గుడిపాటి దత్తు, చివుకుల హరగోపాల్ పాల్గొన్నారు. హరికథా భాగవతార్ బుర్రాపద్మనాభ శాస్త్రిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. పద్మనాభశాస్త్రి, సుందరాకాండ పారాయణం చేశారు.

9 కేజీల గంజాయి పట్టివేత

మహిళ, యువకుడు అరెస్ట్



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ నందమూరినగర్ ప్రాంతంలో నివసిస్తున్న యోగానంద సునీత (38) అనే మహిళ ఇంట్లో గంజాయి ఉన్నట్లుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించగా 9 కేజీల గంజాయి లభ్యమైంది. చేబ్రోలు నవీన్ (25) అనే యువకుడితో కలిసి ఆమె అమలాపురం నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తెలిపింది. పోలీసులు నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సినీనటి భానుమతి శత జయంతి



విజయవాడ కల్చరల్: నవరస నటీమణి సినీనటి భానుమతి అని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. సంగీత సమ్రాట్ కళా సంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళాసమితి, తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ నటి, దర్శకురాలు, నిర్మాత పీ భానుమతి శత జయంతి వేడుకలు, భక్తి సంగీతం, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మానందరావు మాట్లాడుతూ తెలుగు వారు గర్వించతగిన సంగీత విద్వాంసురాలు, నటి భానుమతి అన్నారు. సంగీత దర్శకుడు కేవీ విద్యాసాగర్, సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్, గాయకుడు ఆకురాతి కోదండ రామయ్య, గొళ్ళ నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్ సంగీత విద్వాంసురాలు మహేంద్రవాడ లక్ష్మీరామదాసు సంగీత సేవలను వివరించారు. ఆమెను అతిథులు ఆత్మీయంగా సత్కరించారు. కేవీ విద్యాసాగర్, కేవీ ఆనంద్ భక్తి గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు భక్తి గీతాలను ఆలపించారు. పూర్ణచంద్రిక నిర్వహించారు.

ముగిసిన పీఎన్‌బీ హోమ్‌లోన్ ఎక్స్‌పో

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ రెండు రోజులు నిర్వహించిన హోమ్‌లోన్ ఎక్స్‌పో శనివారం ముగిసింది. బ్యాంక్ ప్రధాన కార్యాలయం జనరల్ మేనేజర్ విజయ్‌కుల్దీప్‌కుమార్, విజయవాడ సర్కిల్ హెడ్ అభిజిత్ సిన్హా, డిప్యూటీ సర్కిల్ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన మేళాలో తొలిరోజు రూ.39 కోట్లు, రెండో రోజు రూ.22 కోట్లు వ్యాపారం సమీకరించారు. రూ.4.40 కోట్లు మంజూరు లేఖలను అందజేశామని తెలిపారు.

'షాడో' ఆగడాలు

- సెంట్రల్ నియోజకవర్గంలో పరిస్థితి
- టౌన్ ప్లానింగ్ అధికారులపై పెత్తనం
- భవన నిర్మాణాలకు రేటు నిర్ణయించి వసూళ్లు
- ఫుడ్ కోర్టులో 'షాడో' వసూళ్లు



సాక్షి టాస్క్ ఫోర్స్: ఇటీవల పార్టీ మారిన ఓ కార్పొరేటర్ నియోజకవర్గ ప్రతినిధి వద్దకు వెళ్లి తనకు ఒక పని చేయాలని కోరాడు. దీంతో ఆయన స్వయంగా 'మాల్యాద్రి'ని కలవండి అని చెప్పాడు. ఆ ప్రజాప్రతినిధి వద్దకు ఏ పని మీద వెళ్లినా.. ఆయన మల్యాద్రినే కలమని చెబుతారు. పార్టీ అభిమానులు, పార్టీలో సీనియర్‌లు ఇలా ఎవరైనా సరే.. మాల్యాద్రిని కలవాల్సిందే. ప్రజాప్రతినిధి స్వయంగా అతని పేరు చెబుతుండడంతో 'షాడో'గా అవతరించాడు.

ఏ నోట విన్నా ఆపేరే..

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఏ నోట విన్నా 'మాల్యాద్రి' పేరు వినిపిస్తోంది. ప్రజాప్రతినిధికి 'షాడో' అంటూ ఇప్పటికే నియోజవర్గం మొత్తం వినిపిస్తోంది. ఇటుక బట్టీలు నిర్వహించే వ్యక్తి కూటమి అధికారంలోకి రాగానే ప్రజాప్రతినిధికి చేరువయ్యాడు. అనతి కాలంలోనే షాడో అవతారమెత్తాడు. నియోజకవర్గంలో చిన్న ప్రహరీ మొదలుకొని అపార్ట్‌మెంట్ల వరకు ఏ నిర్మాణం చేయాలన్న ముందుగా మాల్యాద్రిని కలిసి మాట్లాడుకోవాల్సిందే. అక్కడ మామూళ్లు ముట్ట చెప్పిన తర్వాత అనుమతులు లేకపోయినా సరే నిర్మాణాలు చేపట్టవచ్చు. స్థల విస్తీర్ణం, ఎన్ని ఫ్లోర్లు నిర్మాణం చేస్తారో చెబితే చాలు. మొత్తం ఎంత ముట్టజెప్పాలో ఇట్టే చెప్పేస్తారు. ఆయన నోటి నుంచి ఒక నంబర్ వచ్చిందంటే అక్షరాలా సమర్పించుకోవాల్సిందే. లేదంటే నిర్మాణాలు పునాదుల దశలో నిలిచిపోవడమే. అంతా సక్రమంగా ఉన్నా ఆయన గారికి సమర్పించుకోవాల్సిందే. ప్రజాప్రతినిధి పేరుతో వసూలు చేసే మొత్తం సంగతి అటుంచితే.. ఈయన గారి రేటు వేరే ఉంటుంది. భవన నిర్మాణ యజమానులు ఇతని వద్ద ఇటుక, ఇతర నిర్మాణ సామగ్రి కొనుగోలు చేయాల్సిందే.

లెక్కలు..పక్కాగా..

భవన నిర్మాణ యజమానులు అతను చెప్పే లెక్కలు చూసి ఆశ్చర్య పోతున్నారు. ఏదైనా నిర్మాణం విషయం అతని వద్దకు వెళితే.. ఎన్ని ఇటుకలు, ఎంత సిమెంట్ పడుతుంది. అన్నింటికీ కలిపి ఖర్చు ఎంత అవుతుంది? ఇందులో ప్రజాప్రతినిధి 'ట్యాక్స్' ఇంత అని విడమరిచి చెబుతున్నారు. ఇటీవల ఆంధ్రప్రభ కాలనీ వద్ద భవనం నిర్మించిన వ్యక్తి 'షాడో'కు మామూళ్లు సమర్పించానని, అతను చెప్పే లెక్కలు వింటే ఆశ్చర్యంగా ఉందని చెబుతున్నాడు. ప్రజాప్రతినిధికి సంపద సృష్టించేందుకు 'షాడో' రేయింబవళ్లు శ్రమిస్తున్నాడని అతని బాధితులు చెబుతున్నారు. పగలు భవన నిర్మాణాలు.. రాత్రుళ్లు ఫుడ్ కోర్టులు.. ఇతర వ్యవహారాలు చక్కదిద్దుతున్నట్లు సమాచారం.

ప్రత్యేక గ్యాంగ్..

ఈట్ స్ట్రీట్‌లో చిరువ్యాపారులు మాల్యాద్రి పేరు చెబితే హడలి పోతున్నారు. అతని దందాను ప్రశ్నిస్తే ఎక్కడ జీవనోపాధి పోతుందోనని భయపడుతున్నారు. అతను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న గ్యాంగ్ ఈట్ స్ట్రీట్, బీఆర్టీఎస్ రోడ్లలో హల్‌చల్ చేస్తున్నారు. తమ మాట వినని చిరువ్యాపారులను బెదిరించి దారికి తెచ్చుకుంటున్నారు. పోలీసులకు చెప్పినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.

'షాడో' బావమరిది వసూళ్లు..

ఈట్ స్ట్రీట్, ఫుడ్‌కోర్టు వ్యవహారాలు మాల్యాద్రి, అతని బావమరిది చక్కదిద్దుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ వ్యాపారులకు జారీ చేసిన కార్డులు ఉన్నప్పటికీ వీరు అనుమతిస్తేనే స్టాల్ ఏర్పాటు చేసుకోవాలి. జనరేటర్, స్వీపర్ల ఖర్చు పేరుతో ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఒక్కో షాపునకు జనరేటర్, స్వీపర్ల ఖర్చు పేరుతో రూ.450 వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మరుసటి రోజు బండి లేకుండా చేస్తున్నారు. షాడో బావమరిది ఈట్‌స్ట్రీట్‌లో వసూళ్లు, ఇతర వ్యవహారాలు చూసుకుంటున్నారు. ఈట్‌స్ట్రీట్‌లో ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. భవన నిర్మాణాలు, రైతుబజార్లు, ఇతర సెటిల్‌మెంట్లు, ఈట్ స్ట్రీట్ ఇలా రోజువారీ కలెక్షన్ లక్షల్లో వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఎస్సీవర్గీకరణపై తీర్పు రాజ్యాంగ విరుద్ధం

- రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బీజేపీ
- బహుజన రాజకీయ పార్టీల ఐక్యవేదిక



చర్చావేదికలో పాల్గొన్న బహుజన పార్టీల నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని వక్తలు విమర్శించారు. దేశంలో ఆరెస్సెస్ రాజ్యాంగం అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడిందన్నారు. శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో బహుజన రాజకీయ పార్టీల జేఏసీ ఆధ్వర్యంలో చర్చా వేదిక జరిగింది. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వేదిక తీర్మానించింది. చర్చావేదికలో పాల్గొన్న వేదిక కన్వీనర్ జై భీమ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు నుంచి మున్సిఫ్ కోర్టుల వరకు అన్నీ కాషాయమయం అయ్యాయన్నారు. వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చి ఒక రాష్ట్ర సమస్యను దేశ వ్యాప్త సమస్య చేసిందన్నారు. కులాల మధ్యచిచ్చు పెట్టిందన్నారు. అంబేడ్కర్ ఆశించిన బడుగుల ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు. ఆంధ్ర బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు పంతగాని రమేష్ మాట్లాడుతూ ఎస్సీ కులాల వర్గీకరణ కేసులో సుప్రీం కోర్ట్ అతి దారుణమైన తప్పు చేసిందన్నారు. ఈ తీర్పు ప్రెసిడెన్షియల్ ఆర్డర్, రాజ్యాంగానికి వ్యతిరేకమని అన్నారు. ఈ తీర్పును వ్యతిరేకిస్తున్నామన్నారు. దళితులను చీల్చే తీర్పు వెలువరించిందన్నారు. భవిష్యత్తులో వాళ్లు రాజకీయ శక్తిగా ఎదిగే అవకాశం లేకుండా కుట్ర జరుగుతోందన్నారు. ఎల్‌జేడీ నాయకులు బూరుగు రత్నం మాట్లాడుతూ వర్గీకరణపై ప్రధానమంత్రి చెప్పినట్లుగా ఇచ్చిన తీర్పుని విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ వంటి విషయాలపై పార్లమెంట్‌కు మాత్రమే అధికారం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరపడానికి వీల్లేదన్నారు. వేదికలో మహాజన రాజ్యం పార్టీ నాయకులు సంఘటి మనోహర్, జై భీమ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డేనియల్, సోషల్ డెమొక్రటిక్ పార్టీ నాయకులు సత్తార్, దళిత సంక్షేమ పార్టీ నాయకులు తవనం భూషణం, చల్లా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఐ డొనేషన్ క్యాంపులను ప్రోత్సహించాలి



సభలో మాట్లాడుతున్న యాంటీ నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.కె.రవికృష్ణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): అంధత్వ నిర్మూలనకు ఐ డొనేషన్ క్యాంపులను విరివిగా ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని యాంటీ నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.కె. రవికృష్ణ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 5వ రాష్ట్ర మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల చట్టం-2016, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నియమాలు-2023 తెలుగులోకి అనువదించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విభిన్న ప్రతిభావంతులైన వారిలో మట్టిలో మాణిక్యాలను గుర్తించి రాబోయే 10 సంవత్సరాలలో సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యే విధంగా తన వంతు పాత్ర పోషిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్య నారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి పోరాడే విషయంలో ఈ అసోసియేషన్ రాష్ట్రంలోని ఉద్యోగ సంఘాలన్నింటికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఎన్నో ప్రభుత్వ ఉత్తర్వులను పోరాడి సాధించుకోవడంతో పాటు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ సంఘాలతో పోరాడటంలో కూడా ముందు నిలుస్తోందని కొనియాడారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా తమ అసోసియేషన్ అంధులైన ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాడి ఎన్నో విజయాలను సాధించిందన్నారు. ఈ సందర్భంగా అర్జున్ అవార్డు గ్రహీత భారత అంధుల క్రికెట్ కెప్టెన్ ఐ.అజయ్‌కుమార్‌రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగుల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి బాజీ పటాన్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎం.వి. రంగారావు, సెక్రటరీ జమలయ్య, రాయలసీమ రీజియన్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్లు శారదారాణి, సబితారాణి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి ఆహాలో డ్యాన్స్ ఐకాన్ సీజన్-2



మీడియా సమావేశంలో ఓంకార్, మానస్, దీపిక తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): డాన్స్ లవర్స్‌ను మెస్మరైజ్ చేసిన డ్యాన్స్ ఐకాన్ సీజన్-1కు కొనసాగింపుగా డ్యాన్స్ ఐకాన్ సీజన్ -2 వైల్డ్ ఫైర్ ఈ నెల 14 నుంచి ఆహా ఓటీటీలో ప్రీమియర్‌కు రెడీ అయిందని ప్రముఖ యాంకర్, దర్శకుడు, డాన్స్ ఐకాన్ సీజన్ 2 హోస్ట్ ఓంకార్ తెలిపారు. డ్యాన్స్ ఐకాన్-1 ఎంత సక్సెస్ అయిందో అందరికీ తెలుసునని, డాన్స్ ఐకాన్-2 అంతకు మించి అలరించనుందని చెప్పారు. నగరంలోని ఓ హోటల్‌లో డాన్స్ ఐకాన్-2 టీం శనివారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఓంకార్ మాట్లాడుతూ డ్యాన్స్ ఐకాన్ 2 వైల్డ్ ఫైర్‌కు హీరోయిన్ ఫరియా అబ్దుల్లా హోస్ట్‌గా చేస్తుండటం సంతోషంగా ఉందన్నారు. శేఖర్ మాస్టర్ సెకండ్ టైమ్ ఈ షోకు జడ్జిగా వ్యవహరిస్తున్నారన్నారు. డ్యాన్స్ ఐకాన్- 2 వైల్డ్ ఫైర్‌లో ఐదుగురు కంటెస్టెంట్స్ సర్‌ప్రైజ్ చేస్తారని చెప్పారు. సమావేశంలో డ్యాన్స్ ఐకాన్-2 మెంటార్స్ మానస్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే అల్లూరి సీతారామరాజు సర్కిల్ (బుడమేరు వంతెన)లో గత కొంతకాలంగా వెలగని హైమాస్ట్ లైట్లకు నగరపాలక సంస్థ సిబ్బంది శనివారం మరమ్మతులు చేశారు. ఇటీవల నగరపాలక సంస్థ కొనుగోలు చేసిన హైడ్రాలిక్ వాహనాలతో హైమాస్ట్ లైట్లకు మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

12న సిద్ధార్థ ఆడిటోరియంలో సియన్షియా



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): శాస్త్ర విజ్ఞానాన్ని యువతరంలో వ్యాప్తి చేయడానికి సీయన్షియా పేరుతో ఈ నెల 12వ తేదీన సిద్ధార్థ ఆడిటోరియంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కళాశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిద్ధార్థ కళాశాల వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, జీవసాంకేతిక శాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. క్విజ్, పీపీపీ, అరుదైన జీవజాల సమాచార ప్రదర్శన, మిస్టర్ అండ్ మిస్ బయో మొదలైన పోటీలను నిర్వహిస్తామని వివరించారు. ఎన్టీఆర్, కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు జిల్లాల నుంచి డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల, వృక్ష శాస్త్రాధిపతి డాక్టర్ పువ్వాడ శ్రీనివాసరావు, కార్యక్రమం కో-కన్వీనర్ డాక్టర్ సాంబానాయక్, అధ్యాపకులు డి.శ్రావణి, సీహెచ్ శిరీష, పి.లలితా ప్రియాంకతో పాటుగా విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీదత్తసాయి మందిర వార్షికోత్సవం



పసుపుతోట వీధులలో సాయి భిక్షాటన

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీ దత్తసాయి మందిరం 10వ వార్షికోత్సవం శనివారం రెండో రోజుకు చేరుకున్నాయి. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం బాబావారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మధురానగర్, పసుపుతోట, నేతాజీ కాలనీ, ఇందిరా కాలనీ, సాయిబాబా కాలనీ తదితర ప్రాంతాలమీదుగా సాయి భక్తులు భిక్షాటన చేశారు. దారి పొడవునా సాయిగీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిగింది.

నేడు పూర్ణాహుతి- అన్నప్రసాద వితరణ

ఆదివారం బాబావారికి 21 దివ్య ద్రవ్యములతో అభిషేకం, అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తంగెళ్లమూడి వీరమోహనరావు తెలిపారు. శ్రీసాయి నక్షత్రమాలిక 11వ మహాయజ్ఞంలో 58వ పర్వం ప్రారంభం అవుతుందని, 57వ పర్వం పూర్ణాహుతి, లక్ష్మీగణపతి హోమం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు. సాయి భక్తులు బాబావారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు.

యువ నటులకు ప్రోత్సాహం ఇవ్వాలి



దంతవేదాంతం నాటకంలోని ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: యువ నటులలోని ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం ఇవ్వాలని సుమధర కళానికేతన్ అధ్యక్షుడు సామంతపూడి నరస రాజు అన్నారు. సుమధర కళానికేతన్ ఆధ్వర్యంలో 51వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ హాస్యనాటికల పోటీలు శనివారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరాజు మాట్లాడుతూ నాటకం భవిష్యత్ యువ నటీనటులతోనే సాధ్యమన్నారు. పౌరాణిక, సాంఘిక నాటకాల్లో ప్రతిభను చూపిస్తున్న యువ నటులు సాయి శంకర్, బీ రూపాశ్రీలకు శనగల కబీర్‌దాస్ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, దేవినేని కిషోర్‌కుమార్, డాక్టర్ పూర్ణానందం, సాంస్కృతిక సంస్థల ప్రతినిధి సామంతపూడి వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు. తొలినాటికగా ఈవీఎస్ కళాసమితి విజయవాడ వారి దంతవేదాంతం నాటికను ప్రదర్శించారు. పొరబాటున విషం కలిపిన కాఫీ తామే తాగివుంటామని కుటుంబ సభ్యులు బంధువులు భయంతో అల్లాడటం. పరీక్షించడానికి వచ్చిన డాక్టర్ కూడా తాను కూడా విషం తాగానని భ్రమపడటం చివరకు అది విషం కాదని తెలియడంతో కథ సుఖాంతమవుతుంది. రెండవ నాటికగా మా ఇంట్లో మహాభారతం, నాటికను మూడవ నాటికగా దొందూ దొందేనాటికను ప్రదర్శించారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పేద, మధ్య తరగతి విద్యార్థులకు విజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగదర్శిని పేరుతో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువతకు ఉచితంగా శిక్షణ తరగతులను నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఉచిత శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం ఆవిష్కరించారు. విజన్ ఫౌండేషన్ చైర్మన్ జి.విజయకుమార్ మాట్లాడుతూ న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ కళాశాలతో కలిసి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోనే పోటీ పరీక్షలకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. విజయవాడ బెంజ్‌సర్కిల్ సమీపంలో ఉన్న తమ కేంద్రంలో మూడు నెలల పాటు ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని, శిక్షణ పూర్తి చేసిన వారికి ఒక సంవత్సరం పాటు ఆన్‌లైన్ పరీక్షలు, డౌట్స్ క్లారిఫికేషన్ (సందేహాల నివృత్తి) సెషన్లు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా 93461 96829 నంబరులో లేదా మైవిజన్‌ఫౌండేషన్.ఇన్ వెబ్‌సైట్‌లో కాని పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ నెల 17వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ పాల్గొన్నారు.

నెలలో 2వ శనివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రతి నెలా 2వ శనివారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన అధికారులతో కలిసి 64వ డివిజన్ కండ్రిక జంక్షన్‌లోని డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ వద్ద మురుగు కాల్వలను, డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న డ్రెయినేజీ కాల్వలను శనివారం పరిశీలించారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా మూడవ శనివారం ప్రభుత్వం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తుందని, అలా కాకుండా ఈ ప్రాంతంలోని శానిటేషన్ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ప్రతి నెలా 2వ శనివారం 200 మంది కార్మికులు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు 9 డివిజన్లలో స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఆరోగ్యాంగా జీవించడానికి మెరుగైన శానిటేషన్ చర్యలు చేపడతామన్నారు. పార్టీ నాయకులు పలగాని శివ, భాగ్యలక్ష్మి,అశోక్, రవికుమార్, ఏఎంహెచ్‌ఓ బాబు శ్రీనివాస్, రమేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పాయకాపురం(విజయవాడరూరల్): స్పందన సేవా సమితి, స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్‌నగర్లోని రాజీవ్ గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవాసమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, బీపీ, కీళ్ల నొప్పులు, గుండె సంబంధిత, థైరాయిడ్ తదితర వ్యాధులకు ప్రముఖ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉచితంగా ఈసీజీ తీస్తారు. అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా అందజేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేద ముస్లింలకు సేవలు అందించాలి



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడ రూరల్): ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులుగా చేరుతున్న వారు పేద ముస్లింలకు సేవలందించాలని కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా అన్నారు. శనివారం కండ్రికలో మసీదువద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీ చేస్తున్న సేవాకార్యక్రమాలను ముస్లింలకు వివరిస్తూ కమిటీలను నియోజకవర్గాల్లో బలోపేతం చేయాలని సూచించారు. అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన షేక్ నాగూర్ వలీని ఆజాద్ ముస్లిం కమిటీ విజయవాడ నగర ఉపాధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు నాగుల్ మీరా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన వారైన పేద ముస్లిం మైనార్టీలకు సేవలందించాలనే ఆసక్తి ఉన్న వారికి కమిటీలో స్థానం కల్పిస్తామన్నారు. 2025వ సంవత్సరంలో చేపట్టే సేవాకార్యక్రమాలను వివరించారు. నగరంలో కమిటీని బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని నాగూర్ వలీ అన్నారు. కమిటీ నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, 64వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఆరిఫ్, కమిటీ ప్రతినిధులు షేక్ నాగుల్ మీరా, షేక్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. జక్కంపూడి కాలనీకి చెందిన షేక్ జుబేదా నూజివీడుకు చెందిన కుంభ తేజను ప్రేమ వివాహం చేసుకుంది. కొంత కాలం కిందట విభేదాలు రావడంతో జుబేదా పుట్టింటికి వచ్చేసింది. శుక్రవారం జుబేదా తల్లిదండ్రులు, బంధువులు తేజ ఇంటికి వెళ్లి మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. అయితే అదే సమయంలో జుబేదా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తేజను జుబేదా గురించి ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో తల్లి ఆషా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.